కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -138 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 30-05-2026 శనివారం పేజీలు : 4

# ఆర్‌బీఐ సంచలన ప్లాన్

## కాగితపు నోట్ల స్థానంలో 'ప్లాస్టిక్ కరెన్సీ'..!




**న్యూస్ డెస్క్, 29 మే (బి.యన్.యస్):** భారతదేశ కరెన్సీలో త్వరలోనే సరికొత్త మార్పు రాబోతుందని, ఇందుకోసం ఆర్బీఐ సంచలన ప్లాన్ సిద్ధం చేసిందని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. గత కొన్నేండ్లుగా అందుబాటులో ఉన్న సాంప్రదాయ కాగితపు నోట్ల స్థానంలో ప్లాస్టిక్ (పాలిమర్ ఆధారిత) కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కసరత్తులు ప్రారంభిస్తోందని తాజా నివేదికలు చెబుతున్నాయి.

# గోదావరి పుష్కరాలపై పవన్ కల్యాణ్ ఫోకస్

## కార్యాచరణ ప్రకటన

**న్యూస్ డెస్క్, 29 మే (బి.యన్.యస్):** గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో మునిగిపోయింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. దీనికోసం డిప్యూటీ సీఎం గ్రౌండ్ లెవల్‌లోకి వెళ్లి మరీ పని చేస్తున్నారు.. ఇక, గోదావరి పుష్కరాల ముందు కాలుష్య నియంత్రణపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాలు పేరుతో కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. ఆరు జిల్లాల్లో 262 పుష్కర పంచాయతీలను గుర్తించి వాటిని మురుగురహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. గోదావరిలోకి మురుగు నీరు నేరుగా కలవకుండా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపాలిటీల సామర్థ్యానికి అనుగుణంగా మురుగు శుద్ధి ప్లాంట్లు నిర్మించాలని.. పీసీబీ మంజూరు చేసిన రూ.100 కోట్ల నిధులతో పాటు అవసరమైతే స్వచ్ఛాంధ్ర నిధులను కూడా వినియోగించాలని ఆదేశించారు.

ప్రస్తుతం రోజుకు 104 మిలియన్ లీటర్ల మున్సిపల్ మురుగు, 8.38 మిలియన్ లీటర్ల గ్రామీణ మురుగు గోదావరిలో కలుస్తోందని అధికారులు గుర్తించారు. మరోవైపు ఆంధ్ర పేపర్స్ నుంచే రోజుకు 32 మిలియన్ లీటర్ల పారిశ్రామిక కాలుష్యం విడుదల అవుతుండగా.. 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం కూడా జీవనదిని తీవ్రంగా కలుషితం చేస్తున్నట్టు వెల్లడైంది.




# దేశ రాజకీయాల్లో టీడీపీ టాప్

## ప్రాంతీయ పార్టీల్లో ఆదాయంలో నెంబర్ వన్

- టీడీపీకి రూ.228 కోట్ల ఆదాయం
- ఖర్చుల్లో వైసీపీ టాప్
- జనసేనకు రూ.64 కోట్ల ఆదాయం
- బీఆర్ఎస్‌కు వడ్డీతో భారీ లాభం
- తృణమూల్ రెండో స్థానంలో
- పార్టీల ఆదాయం భారీగా తగ్గింది
- చందాలతో టీడీపీ ఖజానా ఫుల్
- వైసీపీ ఖర్చులు రూ.340 కోట్లు
- ప్రాంతీయ పార్టీల లెక్కలు బయటకు
- ఏడీఆర్ రిపోర్ట్‌తో ఆసక్తికర వివరాలు
- 36 పార్టీల ఖర్చులు అధికం
- టీడీపీకి విరాళాల జోరు
- జనసేనకు సభ్యత్వ ఫీజులే బలం
- బీఆర్ఎస్ ఆదాయంలో వడ్డీదే వాటా
- ఎన్నికల తర్వాత మారిన లెక్కలు




**న్యూస్ డెస్క్, 29 మే (బి.యన్.యస్)** దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలకు సంబంధించి ఆదాయాల లెక్కలు ఆసక్తికరంగా మారాయి. 36 ప్రాంతీయ పార్టీలకు సంబంధించి 2024-2025 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం.. గత ఆర్థిక సంవత్సరం 2023-2024తో పోలిస్తే 51.57 శాతం తగ్గింది. ఆసక్తికరంగా 21 పార్టీలు ఆదాయం కంటే ఎక్కువ ఖర్చు చేయడం విశేషం. మే 27న ఏడీఆర్ (అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్) రిపోర్ట్ ద్వారా ఆసక్తికర విషయాలు తెలిశాయి. 2024-25కు సంబంధించి 67 గుర్తింపు పొందిన ప్రాంతీయ పార్టీలు ఉంటే.. వాటిలో 36 పార్టీలకు సంబంధించి ఆడిట్ వివరాలు వెల్లడించారు.

2024-2025లో 36 ప్రాంతీయ పార్టీలకు రూ.1,192 కోట్ల ఆదాయం రాగా.. వీటిలో రూ.1,433 కోట్లు ఖర్చు చేశారు. ఈ ప్రాంతీ పార్టీలు వచ్చిన ఆదాయం కంటే రూ.241 కోట్లు (20.13%) ఎక్కువ ఖర్చు చేయడం విశేషం. టీడీపీకి 2024-2025లో రూ.228.31 కోట్ల ఆదాయం వచ్చింది. వీటిలో రూ.120 కోట్లు రుసుము, చందాల రూపంలో వచ్చాయి.. విరాళాలుగా రై.85.20 కోట్లు.. బ్యాంకు డిపాజిట్లపై వడ్డీ రూ.23.02 కోట్లు.. అలాగే మరో రూ.0.05 కోట్లు వచ్చినట్లు తెలిపారు. రెండో స్థానంలో తృణమూల్ కాంగ్రెస్ రూ.219.35 కోట్లతో ఉంది, మూడో స్థానంలో వైఎస్సార్‌సీపీ రూ.140.38కోట్లు, బీఆర్ఎస్ రూ.123.67 కోట్లు, బీజేడీ రూ.110.13 కోట్లు, ఏఐడీఎంకే రూ.86 కోట్లు, జనసేన రూ.64 కోట్లు ఆదాయం వచ్చింది.

మిగతాది 2 లో..

# దేశంలో ధాన్యం సేకరణలో రాష్ట్రం నంబర్ వన్: మంత్రి ఉత్తమ్




# రాహుల్ గాంధీతో భేటీ.. రాజ్యసభ పదవి కోరిన షర్మిల




# నీట్ పేపర్ లీక్ వ్యవహారం

## సుప్రీంకోర్టులో ఎన్టీఏ అఫిడవిట్ దాఖలు




**న్యూస్ డెస్క్, 29 మే (బి.యన్.యస్)** నీట్ యూజీ పరీక్షల పేపర్ లీక్ వివాదంపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో కీలకమైన అఫిడవిట్ దాఖలు చేసింది. అయితే, సుప్రీం ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎన్‌టీఏ పాత తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేదని వ్యాఖ్యానించిన నేపథ్యంలో.. పరీక్షా విధానంలో తాము తీసుకొచ్చిన విస్తృతమైన సంస్కరణలు, భద్రతా మార్పులను ఎన్‌టీఏ కోర్టుకు వివరించింది.

# దమ్ముంటే నా సవాల్ స్వీకరించు

## కేటీఆర్ కు పొంగులేటి మరోసారి చాలెంజ్




**న్యూస్ డెస్క్, 29 మే (బి.యన్.యస్)** తెలంగాణ రాజకీయాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య సవాళ్ల పర్వం రంజుగా మారింది. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఇరువురి మధ్య పంచ్ డైలాగులు పేలుతున్నాయి. ఈ క్రమంలో 'సవాళ్లు చేయడం..పారిపోవడం నీతిలేని కాంగ్రెస్ నేతలకు అలవాటు!'అంటూ ఎక్స్ వేదికాగ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు తాజాగా మంత్రి పొంగులేటి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లే మాప్రభుత్వానికి రిఫరెండం అని, ఈ సవాల్ ను స్వీకరించే దమ్ముందా లేదా కేటీఆర్ అని ప్రశ్నించారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గురించి మాట్లాడే దమ్ము లేకే హైదరాబాద్ ఇండ్ల మీద పడ్డావ్. అదే హైదరాబాద్‌లో ఇండ్ల అంశంపై సవాల్ చేస్తే ఆ సవాల్?ను స్వీకరించే ధైర్యం లేక పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నావ్ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాది చేతల ప్రభుత్వం కాబట్టే చిత్తశుద్ధి, సత్తా ఉన్నాయి కాబట్టే... తొలి రెండున్నరేళ్లలోనే గ్రామాల్లో 4.5 లక్షల ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించామన్నారు.

# కల్తీ మద్యం తాగి 15 మంది మృతి..

## పలువురి పరిస్థితి అత్యంత విషమం





**న్యూస్ డెస్క్, 29 మే (బి.యన్.యస్)** కల్తీ మద్యం తాగి ఏకంగా 15 మంది దుర్మరణం పాలైన హృదయవిదారక ఘటన మహారాష్ట్ర లోని పింప్రి-చించ్వాడ్, పుణె జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకుంది. మరికొంతమంది ఆసుపత్రుల్లో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. పోలీసుల సమాచారం ప్రకారం.. పింప్రి-చించ్వాడ్ పరిధిలోని దాపోడి, ఫుగేవాడి ప్రాంతాల్లో అత్యధికంగా 8 మంది మరణించారు. అటు పుణె నగర పరిధిలోని కాలేపడల్ ప్రాంతంలో ముగ్గురు, హడప్సర్ ప్రాంతంలో ఇద్దరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన వారు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లుగా తెలుస్తోంది.

BNS BHARAT NEWS SPECTRUM ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్



# తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ గుడ్ న్యూస్

## ఈ సారి సాధారణం కంటే ఎక్కువ వర్షాలు



**న్యూస్ డెస్క్, 29 మే (బి.యన్.యస్)** ఓవైపు ఎండలు, మరోవైపు వానలు, సూపర్ ఎల్నీనో అంటూ వస్తున్న వార్తలతో సతమతమవుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. 2026 నైరుతి రుతుపవనాల కాలానికి సంబంధించి ఐఎండీ ఈరోజు తన తుది దీర్ఘకాలిక వాతావరణ అంచనాలను విడుదల చేసింది. ఈ సీజన్‌లో తెలంగాణలో సాధారణం, అంత కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌తో కూడిన మధ్య తెలంగాణ ప్రాంతాల్లో ఈసారి భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. అటు ఆంధ్రప్రదేశ్‌లోని మధ్య కోస్తా ప్రాంతాల్లో కూడా రుతుపవనాల ప్రభావం అనుకూలంగా ఉండనుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ వర్షాలు ఉభయ రాష్ట్రాల్లోని వ్యవసాయ రంగానికి, తాగునీరు, భూగర్భ జల వనరుల పునరుద్ధరణకు ఎంతో ఊరటనిస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

దేశవ్యాప్తంగా 'సూపర్ ఎల్ నినో' ఆందోళన

తెలుగు రాష్ట్రాలకు సానుకూల అంచనాలు ఉన్నప్పటికీ, దేశవ్యాప్త పరిస్థితి మాత్రం కొంత ఆందోళనకరంగానే ఉండేలా కనిపిస్తున్నట్లు ఐఎండీ అంచనా వేసింది. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'సూపర్ ఎల్ నినో' ప్రభావం కారణంగా దేశంలోని ఇతర ప్రాంతాలలో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది. ఇది దేశవ్యాప్తంగా రుతుపవనాల విస్తరణ పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. వాతావరణంలో నెలకొన్న ఈ అనిశ్చితి దృష్ట్యా, లభించే ప్రతి నీటి చుక్కను ఆచితూచి, పొదుపుగా వాడుకోవాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు.

# సర్ పై కాంగ్రెస్ శిక్షణా షురూ

## కుట్రలు జరగకుండా చూసుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ అలర్ట్



**న్యూస్ డెస్క్, 29 మే (బి.యన్.యస్)** కేంద్ర ఎన్నికల సంఘం ప్రారంభించిన ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై తెలంగాణ కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. ఈ ప్రక్రియ సమయంలో అనుసరించాల్సిన తీరుపై కాంగ్రెస్ పార్టీ తమ నేతలకు శిక్షణను శుక్రవారం గాంధీ భవన్‌లో ప్రారంభించింది. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీపీసీసీ మాస్టర్ ట్రైనీలకు ఏఐసీసీ శిక్షణ విభాగం నుంచి వచ్చిన సౌరబ్, నిశాంత్, అనూష శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనీలు నియోజకవర్గాల్లోని బీఎల్ఏలకు శిక్షణ ఇవ్వనున్నారు.

కుట్రలు జరగకుండా చూసుకోవాలి: మహేశ్ కుమార్ గౌడ్

ఈ సందర్భంగా మాట్లాడిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. కాంగ్రెస్?ను మరింత బలోపేతం చేసేందుకు సమర్థవంతమైన కార్యవర్గాన్ని సిద్ధం చేసేందుకు రాష్ట్రంలో సంఘటన్ సృజన్ అభియాన్ పక్రియ పకడ్బందీగా చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. దాదాపు 90కి పైగా నియోజక వర్గాలలో బీఎల్ఏ పూర్తి చేశామని చెప్పారు. జిల్లా కమిటీలు, మండల కమిటీ లు దాదాపు పూర్తి చేశామన్నారు. పశ్చిమ బెంగాల్?లో 93 లక్షల ఓట్లు తీసేశారని అక్కడ బీజేపీ చేసిన కుట్రలతో ప్రభుత్వమే మారిపోయిందన్నారు. ఇక్కడ అలాంటి కుట్రలు జరగకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ప్రతి ఓటును తప్పకుండా చూసుకోవాలని ఇది చాలా కీలకమైన శిక్షణ. దీన్ని క్షేత్ర స్థాయిలో అమలు చేసుకోవాలన్నారు. దేశంలో బీజేపీ ఒక విషపూరిత కుట్రలు చేస్తూ చేస్తోందని ఆరోపించారు.

# మంత్రులు, ఎమ్మెల్యేలకు బిగ్ షాక్

## ఆలయాల్లో వీఐపీ దర్శనాలపై హైకోర్టు సంచలన ఆదేశాలు





**న్యూస్ డెస్క్, 29 మే (బి.యన్.యస్)** దేవాలయాల్లో నడుస్తున్న వీఐపీ సంస్కృతి, ప్రత్యేక రుసుములతో కూడిన పెయిడ్ దర్శనాలపై మద్రాస్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. "దేవుడి ముందు భక్తులందరూ సమానులే. కేవలం ఆర్థిక స్థితిని బట్టి భక్తుల మధ్య వివక్ష చూపడం, వీఐపీల కోసం సామాన్య భక్తులను ఇబ్బంది పెట్టడం భగవంతుడు కూడా క్షమించని తీవ్రమైన 'ఆధ్యాత్మిక పాపం' " అని న్యాయస్థానం ఘాటుగా పేర్కొంది. తమిళనాడులోని మురుగన్ ఆలయాల్లో ఒకటైన ప్రముఖ తిరుచెందూర్ అరుల్మిగు సుబ్రమణ్య స్వామి' ఆలయ నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో వీఐపీ దర్శనాల నియంత్రణపై దాఖలైన పిటిషన్లను విచారించిన సందర్భంగా కోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.

ఈ కేసును విచారించిన జస్టిస్ ఎస్.ఎమ్. సుబ్రమణ్యం ధర్మాసనం, ఆలయాల్లో వీఐపీ సంస్కృతిపై భక్తుల్లో ఉన్న అసంతృప్తిని ప్రస్తావిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది: "దేవాలయాలు లాభార్జన కోసం నడిచే సంస్థలు కావు. భగవంతుడిని దర్శించుకోవడానికి వచ్చే వీఐపీలు కూడా అక్కడి కేవలం భక్తులే. ఆలయ ప్రాంగణాల్లో కేవలం 'భగవంతుడు ఒక్కడే వీఐపీ, వీఐపీల ప్రత్యేక దర్శనాల కారణంగా గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు. ఒకవేళ వీఐపీల వల్ల సామాన్యులు ఇబ్బంది పడేతే, వారు పెట్టి శాపనార్థాలు, ఆవేదన ఆ వీఐపీలకే చుట్టుకుంటాయి." అలాగే, డబ్బులు ఎక్కువ ఇస్తే దేవుడికి దగ్గరగా తీసుకెళ్లడం, ఉచిత దర్శనం చేసుకునే వారిని దూరం నుండి చూపించడం వంటి పద్ధతులు రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కు (ఆర్టికల్ 14), మత స్వేచ్ఛ (ఆర్టికల్ 25) నిబంధనలకు విరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది.

తమిళనాడు ప్రభుత్వం అధికారికంగా నోటిఫై చేసిన ప్రోటోకాల్ పరిధిలోని వీఐపీలకు మాత్రమే ప్రత్యేక దర్శన సదుపాయం కల్పించాలి. వీఐపీ సౌకర్యం కేవలం ఆయా పదవుల్లో ఉన్న వ్యక్తులకు, వారి తక్షణ కుటుంబ సభ్యులకు (భార్య భర్త, పిల్లలు) మాత్రమే వర్తిస్తుంది. వారి బంధువులను, స్నేహితులను వీఐపీలుగా పరిగణించేకూడదు. వీఐపీలతో పాటు వచ్చే ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది లేదా ఆలయ ఉద్యోగులు ప్రత్యేక క్యూలైన్లలో వెళ్లడానికి వీల్లేదు. వారు సాధారణ లేదా పెయిడ్ లైన్లలోనే వెళ్లాలి. వీఐపీల ప్రత్యేక దర్శన సమయాన్ని కేవలం 10 నిమిషాలకు మాత్రమే పరిమితం చేయాలి. గర్భగుడి ముందు ఎక్కువ సమయం కూర్చోవడం లేదా నిలబడటం ద్వారా ఇతరుల దర్శన హక్కును కాలరాయకూడదు. పెద్ద పెద్ద దేవాలయాల్లో రూ. 300 నుండి రూ. 500 వరకు పెయిడ్ టికెట్లు పెట్టి, 'ద్రవిడ ధర్మం' పేరిట క్లాస్ సిస్టమ్ (ఆర్థిక వివక్షను ప్రోత్సహిస్తున్నారంటూ వచ్చిన పిటిషన్లపై కోర్టు తీవ్రంగా స్పందించింది. సనాతన ధర్మంలో ధనిక, పేద అనే తేడా లేదని, డబ్బు అనేది దేవుడిని చేరుకోవడానికి సాధనం కాకూడదని పేర్కొంటూ. ఈ విషయాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని హిందూ సమయ ధర్మాదాయ శాఖ, పర్యాటక శాఖలకు మద్రాస్ హైకోర్టు వెకేషన్ బెంచ్ (జస్టిస్ జీ.ఆర్. స్వామినాథన్, జస్టిస్ వి. లక్ష్మీనారాయణన్) నోటీసులు జారీ చేసింది. వృద్ధులు, గర్భిణీలు, వికలాంగులు, నూతన వధూవరులకు ఇచ్చే మినహాయింపులు మినహా.. మిగిలిన అన్ని రకాల పెయిడ్ కల్చర్, వీఐపీ హంగామాను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కోర్టు తేల్చి చెప్పింది.

# దేశంలో ధాన్యం సేకరణలో రాష్ట్రం నంబర్ వన్: మంత్రి ఉత్తమ్




**న్యూస్ డెస్క్, 29 మే (బి.యన్.యస్)** ధాన్యం కొనుగోలు విషయంలో ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. 29 రాష్ట్రాల్లో తెలంగాణలో కొనుగోలు చేస్తున్నట్లు మరెక్కడా చేయడం లేదని దీనిని భారత ప్రభుత్వమే అంగీకరించిందన్నారు. ధాన్యం కనుగోళ్లలో తెలంగాణ నంబర్ 1 అని కేంద్రం చెబుతోందని వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. మద్దతు ధర కోసం రూ. 16 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు చెప్పారు. మేం వచ్చాక రాష్ట్రంలో ఇప్పటి వరకు ఐదు పంటలు పండితే ఐదు పంటల్లో రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిపామన్నారు. చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేస్తామన్నారు.

రూ.11 వేల 50 కోట్లు చెల్లించాం:

ఇప్పటి వరకు 11 వేల 50 కోట్లను రైతులకు చెల్లించామన్నారు. అకాల వర్షాలతో 60 లక్షల మెట్రిక్ టన్నుల్లో 9 వేలకు పైగా టన్నుల తడిసిన ధాన్యం ఉందన్నారు. తడిసిన ధాన్యం కూడా మద్దతు ధరతో కొంటున్నామని తెలిపారు. కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు ఇసుక, సిమెంట్ ఫ్యాక్టరీల లారీలు ధాన్యం కోసం ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో హమాలీల కొరత ఉందని కూలీలు సొంతూళ్లకు వెళ్లి రావడంతో కాస్త ఆలస్యమైందన్నారు. యాసంగిలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశామన్నారు. బీఆర్ఎస్ వాళ్లు గతంలో 7 వేల కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేస్తే మేం 8 వేల 575 కొనుగోలు కేంద్రాలు పెట్టామని ఇప్పటి వరకు 11 వేల 50 కోట్లను రైతులకు చెల్లించామన్నారు.

# రాహుల్ గాంధీతో భేటీ.. రాజ్యసభ పదవి కోరిన షర్మిల



**న్యూస్ డెస్క్, 29 మే (బి.యన్.యస్):** ఏపీ కాంగ్రెస్ పార్టీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో కాంగ్రెస్ అధిష్టానం ముందు ఒక కీలక ప్రతిపాదన ఉంచినట్లు సమాచారం. కర్ణాటక కోటా నుంచి తనకు రాజ్యసభ పదవిని కేటాయించాలని రాహుల్ గాంధీని ఆమె కోరినట్లు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఈ ప్రతిపాదనకు కాంగ్రెస్ నాయకత్వం నుంచి ఎలాంటి స్పందన వచ్చిందనేది ఇంకా స్పష్టం కానప్పటికీ, ఈ భేటీ ఏపీతో పాటు కర్ణాటక రాజకీయాల్లోనూ తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# దమ్ముంటే నా సవాల్ స్వీకరించు..

## కేటీఆర్ కు పొంగులేటి మరోసారి చాలెంజ్

మొదటి పేజీ తరువాయి

జూన్ 1న మరో 2.5 లక్షల ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించబోతున్నామని హైదరాబాద్ పరిధిలో తొలి విడతలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని స్పష్టం చేశారు.




కాషాయ నేతల కాళ్లు పట్టుకున్న మీకు ఆ అర్హత లేదు:

అవినీతి కేసుల నుండి తప్పించుకోవడానికి ఢిల్లీలో బీజేపీ నేతల ముందు మోకరిల్లింది మీరంటూ కేటీఆర్ పై మంత్రి ధ్వజమెత్తారు. ఈ విషయం స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ ఎంపీ సీఎం రమేష్, మీ సోదరి కవిత సైతం ప్రస్తావించారన్నారు. కేసుల మాఫీ కోసం కాషాయ నేతల కాళ్లు పట్టుకున్న మీకు పౌరుషం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. దళిత ముఖ్యమంత్రి నుండి డబుల్ బెడ్ రూం ఇండ్ల వరకు అన్నీ మాటలు తప్ప, చేతలు ఎక్కడైనా ఉన్నాయా డ్రామారావు అంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అవినీతి, అక్రమాల గురించి కేటీఆర్ మాట్లాడితే.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంటుందని ఎద్దేవా చేశారు.

దమ్ముంటే నా సవాల్ స్వీకరించు:

మీవన్నీ ధరణి దందాలు, బినామీల బాగోతాలు, రియల్ ఎస్టేట్ అక్రమాలని, 2014 కు ముందు మీ ఆర్థిక పరిస్థితి ఏమిటి? పదేళ్లు అధికారంలో ఉండి విచ్చలవిడిగా ఎలా దోచుకున్నారో ప్రజలందరికీ తెలుసన్నారు. గ్రామాల్లో మీరు పదేండ్లలో కట్టిన ఇండ్ల కంటే, కేవలం రెండున్నర సంవత్సరాలలోనే కాంగ్రెస్ ప్రభుత్వం మూడు రెట్లు ఎక్కువ ఇండ్లు నిర్మించిందన్నారు. హైదరాబాద్ లో ఇండ్ల నిర్మాణంపై మరొక్కసారి సవాల్ విసురుతున్నానని.. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ఇండ్ల కంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇండ్లు నిర్మిస్తేనే ఎన్నికల్లో పోటీ చేస్తానన్నారు. కాంగ్రెస్ ఎక్కువ ఇండ్లు నిర్మిస్తే పోటీకి మీరు దూరంగా ఉంటారా? దమ్ముంటే సవాల్ ను స్వీకరించు కేటీఆర్ అని చాలెంజ్ విసిరారు.

# నీట్ పేపర్ లీక్ వ్యవహారం..

## సుప్రీంకోర్టులో ఎన్టీఏ అఫిడవిట్ దాఖలు

మొదటి పేజీ తరువాయి

పరీక్షల పారదర్శకతను పెంచేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన మాజీ ఇస్రో చీఫ్ కె రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులలో చాలా వరకు ఇప్పటికే అమలు చేశామని, అవన్నీ ముగింపు దశలో ఉన్నాయని ఎన్టీఏ తన నివేదికలో కోర్టుకు తెలిపింది.

అదనపు పోస్టుల ఏర్పాటు..

అయితే, ఎన్టీఏ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడానికి 16 కొత్త సీనియర్ పోస్టులను ఏర్పాటు చేశారు. టెక్నాలజీ ఆపరేషన్స్, టెస్ట్ సెక్యూరిటీని పర్యవేక్షించడానికి ఇద్దరు జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారులను అడిషనల్ డైరెక్టర్ జనరల్స్ గా నియమించారు. పరీక్షా కేంద్రాల్లో కచ్చితంగా సీసీటీవీలు తనిఖీ చేయాలని, పరీక్ష ముగిసిన తర్వాత కూడా ఆ ఫుటేజీని కనీసం 90 రోజుల పాటు భద్రపరచాలని ఆదేశించారు. అంతేకాకుండా, రియల్ టైమ్‌లో దొరకని అక్రమాలను గుర్తించేందుకు పరీక్షల అనంతరం సీసీటీవీ ఫుటేజీలపై ఫోరెన్సిక్ విశ్లేషణ జరుపుతామని వెల్లడించింది. భవిష్యత్తులో నీట్ పరీక్షలను కంప్యూటర్ ఆధారిత పరీక్ష మోడ్‌లో నిర్వహించాలా..? లేక పెన్ అండ్ పేపర్ పద్ధతిలోనే కొనసాగించాలా? అనే అంశంపై ఆరోగ్య మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరిపి హైపవర్డ్ కమిటీ త్వరలోనే నిర్ణయం తీసుకోనుందని ఎన్టీఏ కోర్టుకు అఫిడవిట్ రూపంలో విన్నవించింది.

కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు..

పరీక్షల భద్రత కోసం దేశవ్యాప్తంగా స్టేట్ లెవెల్, డిస్ట్రిక్ట్ లెవెల్ కోఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో అడ్మినిస్ట్రేషన్, పోలీస్, ఇంటెలిజెన్స్, ఎన్టీఏ అధికారులు భాగస్వాములుగా ఉంటారు. ఐఐటీ, యూజీసీ, సీబీఎస్ఈ వంటి ప్రతిష్టాత్మక సంస్థల నిపుణులను కూడా ఎగ్జామినేషన్ మేనేజ్‌మెంట్‌లో భాగస్వామ్యం చేసినట్లుగా ఎన్టీఏ కోర్టుకు తెలిపింది.

# కల్తీ మద్యం తాగి 15 మంది మృతి..

## పలువురి పరిస్థితి అత్యంత విషమం

మొదటి పేజీ తరువాయి

ప్రధాన నిందితుడు అరెస్ట్..



ఆసుపత్రిలో చేరిన బాధితుల్లో చాలామంది తీవ్రమైన లక్షణాలతో బాధపడుతున్నారు. కొందరికి చూపు పూర్తిగా కోల్పోవడం, తీవ్రమైన శ్వాసకోశ ఇబ్బందులు, ఆర్గన్ ఫెయిల్యూర్ కావడం వంటి ప్రాణాంతక సమస్యలు తలెత్తినట్లుగా వైద్యులు వెల్లడించారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. అయితే పోలీసుల ప్రాథమిక విచారణలో భాగంగా బాధితులు మద్యంలో మిథనాల్ సాధారణం కంటే ఎక్కువ మోతాదులో కలిపినట్లుగా గుర్తించారు. అయితే, ఈ కల్తీ మద్యాన్ని స్థానికంగా తయారు చేసి, సరఫరా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన నిందితుడు యోగేష్ వాంఖడేను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారు.. రసాయనాలను ఎక్కడి నుంచి సరఫరా చేశారు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

# ఆర్‌బీఐ సంచలన ప్లాన్..

## కాగితపు నోట్ల స్థానంలో 'ప్లాస్టిక్ కరెన్సీ'..!

మొదటి పేజీ తరువాయి




పెరుగుతున్న నోట్ల ముద్రణ ఖర్చులు, మార్కెట్‌లో త్వరగా పాడైపోతున్న కాగితపు నోట్ల సంఖ్యను తగ్గించేందుకు ఆర్‌బీఐ ఈ విప్లవాత్మక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల పాట్నా, ముంబైలలో నిర్వహించిన ఆర్‌బీఐ బోర్డు సమావేశాల్లో ఈ పాలిమర్ నోట్ల ప్రవేశంపై కీలక చర్చలు జరిగినట్లు సమాచారం. కాగితపు నోట్లతో పోలిస్తే ప్లాస్టిక్ నోట్లు తయారీ పరంగా తక్కువ ఖర్చుతో కూడుకున్నవి, ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇవి సులభంగా చిరగవు, తడిసినా పాడవవు ఏటీఎం యంత్రాల ద్వారా కూడా వీటిని సులభంగా సరఫరా చేయవచ్చు. ఈ క్రమంలో ఆర్‌బీఐ మొదట ఒక పైలట్ ప్రాజెక్ట్‌ను సిద్ధం చేస్తోందని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఇదే కనుక నిజమైతే ఇప్పుడున్న పాత నోట్లను కేంద్ర ప్రభుత్వం విడతల వారిగా రీకాల్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# గోదావరి పుష్కరాలపై పవన్ కల్యాణ్ ఫోకస్

## కార్యాచరణ ప్రకటన..



**న్యూస్ డెస్క్, 29 మే (బి.యన్.యస్):** గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో మునిగిపోయింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. దీనికోసం డిప్యూటీ సీఎం గ్రౌండ్ లెవల్‌లోకి వెళ్లి మరీ పని చేస్తున్నారు.. ఇక, గోదావరి పుష్కరాల ముందు కాలుష్య నియంత్రణపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాలు పేరుతో కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. ఆరు జిల్లాల్లో 262 పుష్కర పంచాయతీలను గుర్తించి వాటిని మురుగురహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. గోదావరిలోకి మురుగు నీరు నేరుగా కలవకుండా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపాలిటీల సామర్థ్యానికి అనుగుణంగా మురుగు శుద్ధి ప్లాంట్లు నిర్మించాలని.. పీసీబీ మంజూరు చేసిన రూ.100 కోట్ల నిధులతో పాటు అవసరమైతే స్వచ్ఛాంధ్ర నిధులను కూడా వినియోగించాలని ఆదేశించారు.

ప్రస్తుతం రోజుకు 104 మిలియన్ లీటర్ల మున్సిపల్ మురుగు, 8.38 మిలియన్ లీటర్ల గ్రామీణ మురుగు గోదావరిలో కలుస్తోందని అధికారులు గుర్తించారు. మరోవైపు ఆంధ్ర పేపర్స్ నుంచే రోజుకు 32 మిలియన్ లీటర్ల పారిశ్రామిక కాలుష్యం విడుదల అవుతుండగా.. 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం కూడా జీవనదిని తీవ్రంగా కలుషితం చేస్తున్నట్టు వెల్లడైంది. పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర తనిఖీలు నిర్వహించాలని.. ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 24 గంటల ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్‌కు కంట్రోల్ రూం నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నట్టు తెలిపారు. స్వచ్ఛమైన గోదావరి జలాల్లో భక్తులు పవిత్ర పుష్కరాలు నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..

# దేశ రాజకీయాల్లో టీడీపీ టాప్

## ప్రాంతీయ పార్టీల్లో ఆదాయంలో నెంబర్ వన్

మొదటి పేజీ తరువాయి



వైఎస్సార్‌సీపీకి రూ.140.05 కోట్లు విరాళాల రూపంలో, ఐటీ రీఫండ్ రూ.18 లక్షలు, డిపాజిట్లపై వడ్డీగా రూ.14 లక్షలు.. ఇతర మార్గాల్లో రూ.27వేలు వచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్‌కు డిపాజిట్లపై వడ్డీగా రూ.107.96 కోట్లు, చందాలు- రూ.15.09 కోట్లు, ఐటీ రిఫండ్‌పై వడ్డీగా రూ.13 లక్షలు, ఇతర మార్గాల్లో రూ.48 లక్షల ఆదాయం వచ్చింది. జనసేన పార్టీకి మొత్తం రూ.64 కోట్లలో సభ్యత్వ రుసుం కింద రూ.59.62 కోట్లు, డిపాజిట్లపై వడ్డీ కింద రూ.4.48 కోట్లు వచ్చాయి. 2023-24లో 36 పార్టీలకు రూ.2,463.17 కోట్ల ఆదాయం వస్తే.. 2024-25లో రూ.1,192.94 కోట్లకు తగ్గిందని లెక్కలు చెబుతున్నాయి. బీఆర్ఎస్‌కు ఆదాయం రూ.561 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్-రూ.427 కోట్లు, బీజేడీ- రూ.187 కోట్లు, ఆర్‌జేడీ- రూ.72 కోట్లు, టీడీపీకి-రూ.56 కోట్లు, వైఎస్సార్‌సీపీకి-రూ.50 కోట్ల మేర తగ్గింది.

ఆసక్తికరంగా అన్నా డీఎంకేకు ఆదాయం రూ.39 కోట్లు, ఎంఎన్ఎస్-రూ.37 కోట్లు, జనసేన- రూ.24 కోట్లు, జేఎంఎం-రూ.21 కోట్లు, జేడీయూ- రూ.16 కోట్లు, సీపీఐ ఆదాయం రూ.10 కోట్ల మేర పెరిగింది. వైఎస్సార్‌సీపీ 2024-2025లో వైఎస్సార్‌సీపీ రూ.340 కోట్లు, బీజేడీ రూ.288 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్ రూ.227 కోట్లు, బీఆర్ఎస్ రూ.180 కోట్లు, సమాజ్‌వాదీ రూ.74 కోట్లు, టీడీపీ రూ.61.33 కోట్లు, జనసేన పార్టీ రూ.56.94 కోట్లు ఖర్చు చేశాయి. ఓవరాల్‌గా ప్రాంతీయ పార్టీల్లో ఆదాయంలో టీడీపీ రూ.228 కోట్లు, ఖర్చులో వైఎస్సార్‌సీపీ రూ.340 కోట్లు తొలి స్థానాల్లో నిలిచాయి.

## జిల్లా గ్రంథాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి హాజరైన చైర్మన్, భూపతి రాజు

కాకినాడ (బీఎన్ఎస్) మే 29, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం సంస్థ అధ్యక్షుడు భూపతి రాజు ఈశ్వరరాజు వర్మ (సాయిబాబు రాజు) ఆధ్వర్యములో జిల్లా గ్రంథాలయ సంస్థ సభ్యులైన జిల్లా విద్య శాఖాధికారి, జిల్లా పౌర సంబంధాల శాఖాధికారి, ఉప సంచాలకులు, జిల్లా వయోజన విద్య శాఖాధికారి వారు, జిల్లా పంచాయితీ అధికారి, గ్రంథాలయ సంస్థ సెక్రటరీ పాలంకి నాగరాజు వారితో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి, గ్రంథాలయ సంస్థలో ఉన్న ఉద్యోగుల సౌకర్యార్థం కొన్ని ప్రాంతాల్లో లైబ్రరీన్ గా ఉద్యోగం నిర్వహిస్తున్న ఉద్యోగులకు టైం అయిన తర్వాత వారికి ప్రయాణ సౌకర్యం ఇబ్బందిగా ఉన్నదని అధ్యక్షులు దృష్టికి తీసుకురాగా ఆయన ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉద్యోగం నిర్వహించే విధంగా టైమును సభ్యుల సమక్షంలో తీర్మాణం చేశారు. అలాగే 26 లైబ్రరీల కు దాతల సహకారంతో అక్కడ అవసరమైన ఫర్నిచర్ పుస్తకాలు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 67 గ్రంథాలయాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని ఈ శిక్షణా శిబిరాలకి ఎన్నడూ లేని విధంగా చాలా బాగా ప్రజల నుంచి స్పందన వచ్చినట్లు అధ్యక్షుడు భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ అన్నారు అలాగే ఈ శిబిరాలు జూన్ 6వ తారీఖున ఆఖరి రోజు కావడంతో ఆరోజు ఈ వేసవి శిబిరాల్లో శిక్షణ పొంది మంచి నైపుణ్యం కనపరిచిన విద్యార్థిని విద్యార్థులకు మెమెంటోలు సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని అలాగే ఈ శిబిరంలో అన్ని రోజులు పాల్గొన్న వారికి కూడా సర్టిఫికెట్ ఇవ్వబడుతుందని అధ్యక్షుడు భూపతి రాజు తెలిపారు. అనంతరం గ్రంథాలయ సంస్థ భవనంలో ఉన్న చైర్మన్ వారి చాంబర్ మరమ్మత్తులు చేస్తున్న విధానాన్ని అధ్యక్షుడు సిబ్బందితో కలిసి పరిశీలించారు.



## జవాను విగ్రహ ఆవిష్కరణ

అమలాపురం (బీఎన్ఎస్)మే :29కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామానికి చెందిన ఆర్మీ జవాను బి నాగబాబు మరణానంతరం ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవాను నాగబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



## మహిళలు,చిన్నారుల భద్రత మనందరి బాధ్యత.

కడపజిల్లా (బిఎన్ఎస్) మే 29: మహిళలు, చిన్నారులపైనేరాలకు పాల్పడితే వారిపైకఠిన చర్యలుతీసుకుంటామని, మహిళల, చిన్నారుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ అగ్ర ప్రాధాన్యత ఇస్తున్నాయని, ఎలాంటి సమస్య ఎదురైనా,





ఎప్పుడైనా, తమను సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ పేర్కొన్నారు. ఆపరేషన్ దండయాన్ లో భాగంగా శుక్రవారం రిమ్స్ జీజీహెచ్ మెడికల్ కాలేజ్ సెమినార్ హాలులో రిమ్స్ మెడికల్ కాలేజ్ వైద్య విద్యార్థులకు,దంత వైద్య, నర్సింగ్ విద్యార్థులకు మహిళా భద్రతపై విస్తృత స్థాయిలో అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై,సమాజంలో పెరుగుతున్న వివిధ నేరాల నేపథ్యంలో మహిళలు, పిల్లలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు.జిల్లాలో గత రెండేళ్లలో మహిళలపై నేరాలకు పాల్పడ్డ కేసుల్లో న్యాయస్థానాల్లో కఠిన శిక్షలు విధించబడ్డాయని,జిల్లాలో గత రెండేళ్లలో 44 కేసుల్లో 16 మందికి జీవిత ఖైదు, ఒకరికి 20 సంవత్సరాల శిక్ష,10 మందికి 7,5,3 సంవత్సరాల చొప్పున జైలుశిక్షతో పాటు జరిమానా కూడా విధించడం జరిగిందన్నారు. రౌడీ షీట్ ల తరహాలో లైంగిక నేరాలకు పాల్పడ్డ 197 మంది పై సెక్సువల్ అఫెండర్ షీట్ లను తెరవడం జరిగిందన్నారు. ఒక్కసారి సెక్సువల్ అఫెండర్ షీట్ తెరిస్తే అతనిపై

నిరంతరం పోలీస్ నిఘా ఉంటుందని తెలిపారు. మిస్సింగ్ కేసులను అత్యధిక ప్రాధాన్యతతో దర్యాప్తు చేసి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చడం జరిగిందన్నారు.గత 10 ఏళ్లలో 4209 మిస్సింగ్ కేసులు నమోదు కాగా, 4121 కేసులను ఛేదించడం

జరిగిందన్నారు. డిజిటల్ యుగంలో మీ కందరికి అవగాహన ఉంటుందని, వివిధ రకాలైన మ్యాగజైన్లు, వార్తాపత్రికలు అందుబాటులో ఉన్నాయని, సోషల్ మీడియా సమాచారానికి ప్రధాన వనరుగా మారిందని,సోషల్ మీడియా ద్వారా జ్ఞానం పెంపొందించుకోవచ్చున్నారు. అలాగే సమస్యలు కూడా సోషల్ మీడియా ద్వారా ఉన్నాయని, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరముందని జిల్లా ఎస్పీ సూచించారు. జ్ఞానమే శక్తి అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. జ్ఞానం ఉన్నపుడే శక్తివంతులుగా ఉండగలమని, సమస్య వచ్చినపుడు ఏది చేయాలి, ఎప్పుడు చేయాలిపరిస్థితుల్లో ఎవరినిసంప్రదించాలి అనే విషయాలపై అవగాహన ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. చిన్నసమస్యలను వదిలేస్తే అవి పెద్ద సమస్యలుగా మారే అవకాశం ఉందన్నారు. కాబట్టి చిన్న చిన్న సమస్యలను కూడా తల్లిదండ్రులకు, లేదా మీ ఫ్యాకల్టీ సిబ్బందికి, లేదా పోలీస్ అధికారులు, లేదా నేరుగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో కలిసి సమస్యను తెలియచేయవచ్చున్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 ద్వారా ఫిర్యాదు చేస్తే కేవలం 10 నిమిషాల్లో పోలీసులు మీ వద్దకు చేరుకొని మీ సమస్యను పరిష్కరిస్తారని ఎస్పీ నచ్చికేత్ వైద్య విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని తెలిపారు.

## సుడిగాలికి నేలకొరిగిన భారీ వృక్షం
## యువకుడికి తీవ్ర గాయాలు

కొత్తపేట (బీఎన్ఎస్)మే 29.. కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో అకాల సుడిగాలి బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచే తీవ్ర వడగాలులతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు, రాత్రి ఒక్కసారిగా వీచిన బలమైన సుడిగాలులతో భయాందోళనకు గురయ్యారు. ఈదురుగాలుల ప్రభావంతో పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఈ క్రమంలో పలివెల -- కొత్తపాలెం రహదారిపై దారుణ ఘటన చోటుచేసుకుంది.పలివెల వంతెన దాటిన అనంతరం కాలువ పక్కన ఉన్న భారీ వృక్షం ఒక్కసారిగా నేలకొరిగి రోడ్డుపై కూలిపోయింది. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న కొత్తపాలెం గ్రామానికి చెందిన కుడిపూడి వెంకటేష్ బాబు (30) అనే యువకుడు చెట్టు కింద చిక్కుకుపోయాడు. బలమైన చెట్టు కొమ్మలు బైక్‌పై పడటంతో వాహనం పూర్తిగా ధ్వంసమైపోయింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, అటుగా వెళు న్న ప్రయాణికులు వెంటనే స్పందించి, చెట్టు కొమ్మల మధ్య తీవ్రంగా గాయపడిన వెంకటేష్ బాబును బయటకు తీశారు. అప్పటికే ఆయన తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితిలో ఉన్నట్లు సమాచారం.అనంతరం అత్యవసర అంబులెన్స్ ద్వారా రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.



## ఘనంగా 'రాజశేఖర్ రెడ్డి మెమోరియల్' క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం!

రాపూరు (బి.యన్.యస్):–నెల్లూరు జిల్లా రాపూరుమండల పరిధిలోని రావిగుంటపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, స్వర్గీయ పాపకన్ను రాజశేఖర్ రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన 'మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్' గురువారం నాడు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. రావిగుంటపల్లి క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన ఈ క్రీడా పోటీలను రాపూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దందోలు లక్ష్మీనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ ఆర్గనైజర్ తాటిబోయిన రమేష్ మాట్లాడుతూ.. వాస్తవానికి ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను సంక్రాంతి పండుగ సందర్భంలోనే నిర్వహించాల్సి ఉందని, అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల అప్పుడు నిర్వహించలేక పోయామని తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి, వారికి మంచి ప్రోత్సాహకాలు అందజేశారు.



## ఓటర్ల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా (ఎస్ ఐ ఆర్) కార్యక్రమం


రావులపాలెం (బీఎన్ఎస్)మే :29

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుండి తొలగిపోకుండా పార్టీ శ్రేణులు గ్రామ స్థాయిలో ఇంటింటికి వెళ్లి పరిశీలన చేయాలని పిలుపునిచ్చారు.ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ద్వారా ఓటర్ల వివరాల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపులు వంటి అంశాలపై నాయకులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. రావులపాలెం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ... రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఎదురుగా ఉన్న యాచీదీ ఫంక్షన్ హాల్ లో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, ప్రజాస్వామ్య పరిరక్షణలోనూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేయాలని, రానున్న ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు.



## సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమ్మె సరికాదు

- బిల్డర్స్ అసోసియేషన్
- మాదాపూర్‌లో గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం




గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మిరియాల రాఘవరావు

శేరిలింగంపల్లి:(బిఎన్ఎస్): నిర్మాణ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు రేట్ల పెంపు కోరుతూ సమ్మెకు దిగడం సమంజసం కాదని గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ పేర్కొంది. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో శుక్రవారం అసోసియేషన్ కార్యనిర్వాహక వర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమ్మెతో పాటు నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. అసోసియేషన్ చైర్మన్ మిరియాల రాఘవరావు మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా రేట్లు పెంచాలని సెంట్రింగ్ కాంట్రాక్టర్లు సమ్మె చేయడం సరికాదని అన్నారు. నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వారు వెంటనే సమ్మె విరమించాలని కోరారు.అధ్యక్షుడు కె. రాజా రెడ్డి మాట్లాడుతూ ఒకవైపు కొనసాగుతున్న యుద్ధాల కారణంగా నిర్మాణ సామగ్రి ధరలు పెరుగుతుండగా, మరోవైపు సెంట్రింగ్ సమ్మెతో చిన్న బిల్డర్లు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ స్వప్న శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సమయంలో ప్రభుత్వం మార్కెట్ విలువలను పెంచేందుకు చేస్తున్న ప్రయత్నాలు నిర్మాణ రంగానికి మరింత ఇబ్బందికరంగా మారుతాయని, చదరపు అడుగు రేట్లు పెరగకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ప్రధాన కార్యదర్శి పి.బి.ఎస్. విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ పరిస్థితి అధ్వానంగా ఉందని తెలిపారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత కూడా ట్రాన్స్‌ఫార్మర్లు పొందడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీనివల్ల కష్టమర్ల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరును ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌తో ముడిపెట్టకుండా పనులు జరిగేలా చూడాలని కోరారు. అలాగే దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో రిజిస్ట్రేషన్ చార్జీల శాతాన్ని తగ్గించినట్లు ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించి వినియోగదారులకు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. టెక్నికల్ అడ్వైజర్ సుమా రామకృష్ణ మాట్లాడుతూ బిల్డింగ్ పర్మిషన్ సమయంలో ప్రభుత్వం వసూలు చేస్తున్న లేబర్ సెస్ నిధుల నుంచి సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలని కోరారు.ఈ సమావేశంలో పులి మురళి, ఉపేందర్ రెడ్డి, చక్రపాణి, వాసుదేవరావు, రామకృష్ణ, విజయ ప్రతాపరెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ జీవోలతో రూ.35 కోట్ల భూమి దందా!

- గండిపేట ప్రభుత్వ భూమిపై కన్నేసిన ముఠా బండారం బట్టబయలు
- సైబరాబాద్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్.. ముగ్గురు అరెస్ట్, మరికొందరు పరారీ

శేరిలింగంపల్లి: (బీఎన్ఎస్): ప్రభుత్వ భూమిని కాజేయడానికి నకిలీ జీవోలు సృష్టించి కోట్ల రూపాయల భూ దందాకు పాల్పడిన ముఠా గుట్టును సైబరాబాద్ పోలీసులు రట్టు చేశారు. గండిపేట గ్రామంలోని ప్రభుత్వ పోరంబోకు భూమిని తమదిగా చూపిస్తూ నకిలీ పత్రాలు తయారు చేసి, ఎకరాకు రూ.3.5 కోట్ల చొప్పున విక్రయించేందుకు కుట్ర పన్నిన ముగ్గురిని నార్సింగి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో మరికొందరు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు.

గండిపేట గ్రామ సర్వే నంబర్-18లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని రెగ్యులరైజ్ చేసి తమ పేర్లపై కేటాయించినట్లు చూపిస్తూ నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) సృష్టించి వాటిని వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రచారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ విషయంపై గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

దర్యాప్తులో భాగంగా నిమ్మల వెంకటగోపాల్, నిమ్మల రామస్వామి, నిమ్మల రాజేష్ గౌడ్ నివాసాల్లో కోర్టు అనుమతితో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో బ్యాంకు పాస్‌బుక్కులు, ఎంఓయూలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల విచారణలో కీలక విషయాలు వెలుగుచూశాయి. దశరథ్ కుటుంబ సభ్యులు గతంలో ఈ భూమిపై హక్కులు కోరుతూ హైకోర్టును ఆశ్రయించినప్పటికీ, 2025 అక్టోబర్‌లో వారి పిటిషన్లు కొట్టివేయబడ్డాయి. అయినప్పటికీ భూమిపై ఎలాంటి హక్కులు లేకపోయినా తమను తాము అసలు యజమానులుగా చూపిస్తూ బొల్ల రమేష్, బ్రహ్మనాయుడుతో కలిసి భూమి అమ్మకాలకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తేలింది.

ఈ క్రమంలో భూమి లావాదేవీల పేరుతో సుమారు రూ.4 కోట్ల వరకు అడ్వాన్స్ రూపంలో వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో సునీల్, రాధాకృష్ణ తదితరులు మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు వెల్లడైంది.

అంతేకాకుండా భూమి తమ పేర్లపై ప్రభుత్వం కేటాయించినట్లు చూపించే నకిలీ జీవోలు, ఇతర ప్రభుత్వ పత్రాలను సృష్టించి కొనుగోలుదారులను నమ్మించే ప్రయత్నం చేసినట్లు విచారణలో బయటపడింది. ఈ కేసులో నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వెంకటగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

పరారీలో ఉన్న బొల్ల రమేష్, బ్రహ్మనాయుడు, సునీల్, రాధాకృష్ణతో పాటు ఇతర నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ ఆదేశాల మేరకు నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి, గచ్చిబౌలి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నరేష్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతోంది.

### ప్రజలకు పోలీసుల హెచ్చరిక

నకిలీ జీవోలు, భూ పత్రాలు, సోషల్ మీడియాలో వైరల్ అయ్యే భూముల ప్రకటనలను గుడ్డిగా నమ్మవద్దని సైబరాబాద్ పోలీసులు సూచించారు. భూముల కొనుగోలు ముందు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల ద్వారా పూర్తి స్థాయిలో ధ్రువీకరణ చేసుకోవాలని, నకిలీ పత్రాల తయారీ, భూకబ్జాలు, మోసాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# దుర్గం చెరువులో గుర్తుతెలియని మహిళ మృతి

## - ఎస్‌హెచ్‌వో డి. కృష్ణమోహన్ పర్యవేక్షణలో దర్యాప్తు



సైబరాబాద్: (బిఎన్ఎస్):దుర్గం చెరువులో శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. చెరువులో మహిళ పడిందన్న సమాచారంతో మాదాపూర్ ఎస్‌హెచ్‌వో డి. కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పోలీసు బృందం హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుంది. హైడ్రా సిబ్బంది సహాయంతో చెరువులో గాలింపు చేపట్టగా మహిళ మృతదేహం బయటపడింది. మృతురాలి వయసు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుంది. చామన ఛాయ రంగులో, నలుపు రంగు వెంట్రుకలతో ఉంది. నలుపు రంగు చుడీదార్, క్రీమ్ కలర్ లెగ్గిన్ ధరించి ఉంది.మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్‌హెచ్‌వో డి. కృష్ణమోహన్ పర్యవేక్షణలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతురాలి గుర్తింపు, ఘటనకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. స్థానిక సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

ఆచూకీ కోసం విజ్ఞప్తి: మృతురాలి వివరాలు తెలిసినవారు మాదాపూర్ పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 8712663109 లేదా ఎస్‌హెచ్‌వో డి. కృష్ణమోహన్ సెల్ నంబర్ 8712663100కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# జూన్2న విజయవాడలో విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

## కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలి

కడప జిల్లా (బిఎన్ఎస్) మే 29: బద్వేల్ టౌన్ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీ ప్రకటించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నాయబ్ రసూల్,కె.నాగ మల్లయ్య, జిల్లా కార్యదర్శులు వి. ప్రసాద్,ఎం.నాగరాజు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కె. శ్రీనివాసులు డిమాండ్ చేశారు.ఈ మేరకు శుక్రవారం బద్వేల్‌లోని స్థానిక ఎన్జీవో హోంలో విద్యుత్ శాఖ ముఖ్య నాయకుల సమావేశం

జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చి రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయకపోవడం అన్యాయమన్నారు. అలాగే విద్యుత్ ఉద్యోగులకు ఇప్పటివరకు పీఆర్సీ ప్రకటించకపోవడం బాధాకరమని తెలిపారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనం. 46 వేలుగా నిర్ణయించాలని వారు డిమాండ్ చేశారు. ఖాళీ పోస్టులను కాంట్రాక్ట్ కార్మికులతో భర్తీ చేయాలని, వారికి1 కోటి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రమాదవశాత్తు గాయపడిన కార్మికులకు అపరిమిత వైద్యసదుపాయం కల్పించాలని సూచించారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని,బద్వేల్ సబ్

డివిజన్ ఇఆర్ఓ

కార్యాలయంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టును భర్తీ చేయాలని, జూనియర్ లైన్‌మెన్‌లకు అసిస్టెంట్ లైన్‌మెన్‌లుగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



బద్వేల్ సబ్ స్టేషన్‌లో వర్షాకాలంలో వర్షపు నీరు చేరుతున్న నేపథ్యంలో సివిల్ యంత్రాంగం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా సబ్ డివిజన్ కార్యాలయ పరిధిలో ఖాళీ స్థలంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మైదుకూరు డివిజన్‌లో గత పదినెలలుగా ప్రమోషన్లు నిలిచిపోవడంతో కార్మికులు ఆర్థికంగా

నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో జూన్ 2న విజయవాడలోని ఎంబికె భవన్‌లో రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులు, కార్మిక సంఘాలు, కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చిన్ని కృష్ణ, సుబ్బారావు, బత్తిన శ్రీనివాసులు, అబ్దుల్ వల్లి, ప్రశాంత్, పీసీ కొండయ్య, నరసింహులు, వెంకటసుబ్బయ్య, తదితరులుపాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో నిమ్మచెట్లు దగ్ధం

## ప్రభుత్వం ఆదోకోవాలని రైతు ఆవేదన

నెల్లూరు జిల్లా రాపూరు (బి.యన్.యస్):-నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని సిద్దవరం గ్రామానికి నిరుపేద కుటుంబానికి చెందిన కుంచం వేమయ్య అనే రైతు తనకున్న కొద్ది వ్యవసాయ భూమిలో నిమ్మసాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. దురదృష్టవశాత్తు తన పొలంలోని మెయిన్ లైన్ పై గాలికి జమాయిల్ చెట్టు పడడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగాయి. విషయం



అందుకున్న రాపూరు ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే రైతుకు సుమారు35వేల రూపాయలు విలువ చేసే12నిమ్మచెట్లు కాలిపోయాయి. తన కుటుంబం జీవనాధారం కోల్పోయింది అని ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించాని రైతు కుంచం వేమయ్య ఆవేదన వ్యక్తంచేశారు.

# గిరిజన కుటుంబాలకు పక్కా ఇళ్లను నిర్మించాలి-పంచేటి శ్రీనివాసులు

నెల్లూరు జిల్లా సైదాపురం(బి.యన్.యస్):-నెల్లూరు జిల్లా సైదాపురం మండలం ఊటుకూరు పంచాయతీ పరిధిలో జనవరి 18 తేదీన గ్యాస్ లీకేజ్ కారణంగా 7 గిరిజన ఇల్లు కాలిపోయినందుకాను పక్కా ఇల్లు నిర్మించాలని కోరుతూ సైదాపురం మండలం కొమ్మిపాడులో జరిగిన పల్లె వీక్షణ కార్యక్రమంలో కలెక్టర్ హేమర్ష శుక్ల గారికి సిపిఎం సైదాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల ఇంచార్జ్ పంచేటి , శ్రీనివాసులు మాట్లాడుతూ జనవరి 18వ తేదీన గ్యాస్ ప్రమాదానికి సుమారు ఏడు కుటుంబాలు ఇల్లు పూర్తిగా కాలిపోయాయి ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఎలాంటి నష్ట పరిహారం అందించలేదని తెలియజేశారు అలాగే గ్యాస్ కంపెనీ నుంచి ఇలాంటి నష్ట పరిహారం ఇంతవరకు అందజేయలేదు గ్యాస్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని తెలియజేశారు మండలంలో ఉన్న వీ=ా గారి నుండి కేవలం రేకుల వరకే ఇచ్చి చేతులు దులుపుకోవడం దుర్మార్గమని తెలియజేశారు ఎప్పటికీ మిక్స్ కాలనీ పరిధిలో పరిధిలో ఇళ్లలో కరెంట్ లేక 4 నెలలు నుండి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వెంటనే కాలనీలో ఉన్న ఎస్ టి గిరిజనులకు పక్కా ఇళ్లను నిర్మించాలని అలాగే కరెంటు సౌకర్యం కల్పించాలని సిపిఎం పార్టీ నుండి కలెక్టర్ గారికి వినతిపత్రం అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఊటుకూరు ఎస్టి గ్రామ ప్రజలు సిపిఎం నాయకులు వెంకటేశ్వర్లు ,గిరి తదితరులు పాల్గొన్నారు.....



# దేశంలోనే మొట్ట మొదటి డెక్స్‌పాడ్స్ పరికరం వినియోగంపై మంత్రితో చర్చ

విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న బాట్‌ఫోర్జ్ రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ క్రీడాకారుల కోసం అభివృద్ధి చేసిన డెక్స్‌పాడ్స్ పరికరాన్ని రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి సచివాలయంలోనీ తన చాంబర్లో ఆవిష్కరించారు.




ఈ సందర్భంగా సంస్థ చీఫ్ సేల్స్ ఆఫీసర్ శీలం శ్రీహర్ష మాట్లాడుతూ, రియాక్షన్ ట్రాకింగ్, స్పోర్ట్స్ పనితీరు అంచనా, శాస్త్రీయ శిక్షణ విధానాలు, ప్రతిభ గుర్తింపు క్రీడాకారుల సమగ్ర అభివృద్ధిలో డెక్స్‌పాడ్స్ వంటి ఆధునిక సాంకేతిక పరికరాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. మేక్ ఇన్ ఇండియా లో భాగంగా పూర్తిస్థాయి స్వదేశీ సాంకేతికతతో ఈ పరికరాన్ని రూపొందించినట్లు, దేశంలోనే ఈ తరహా వినూత్న క్రీడా సాంకేతిక పరికరాల్లో ఇది ప్రత్యేకమైనదని మంత్రి గారికి తెలిపారు. క్రీడాకారులు, కోచ్‌లు, స్పోర్ట్స్ అకాడమీలు, విద్యాసంస్థలు, శిక్షణ కేంద్రాలకు ఈ సాంకేతికత ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రతినిధులు పేర్కొన్నారు.

క్రీడా అభివృద్ధికి దోహదపడే వినూత్న సాంకేతిక పరిజ్ఞానాలను ప్రభుత్వం ప్రోత్సహించే దిశగా సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సీఈఓ రాజేష్, సిటివో చైతన్య, సిఓఓ సెల్వేందర్ పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తల అవగాహన సదస్సు

నల్లగొండ (బీఎన్ఎస్):

యువత ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురు చూడకుండా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించు కోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తల అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ,.... ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్లు, ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకొని యువత వ్యాపార రంగంలో ముందుకు రావాలని కోరారు. పరిశ్రమలు, వ్యాపార కేంద్రాల ఏర్పాటుపై యువతకు మార్గనిర్దేశం చేయడంలో మిక్కి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని కలెక్టర్ తెలిపారు.. విజయం సాధించిన పారిశ్రామికవేత్తల అనుభవాల నుంచి స్ఫూర్తి పొందడంతో పాటు, వ్యాపారంలో ఎదురైన వైఫల్యాల నుంచి కూడా గుణపాఠాలు నేర్చుకోవాలని సూచించారు. .




సదస్సులో ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తలు, యువత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సదాశివరావుకు ఘన నివాళి అర్పించిన తోట రామారావు


ఖమ్మం : ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ సారధి నగర ప్రాంత స్థిర నివాసితులు గుంటు మల్లేశ్వర స్వామి ఆలయ మాజీ డైరెక్టర్, మున్నూరు కాపు సంఘ సభ్యులు సదాశివరావు గురువారం ఉదయం 11 గంటలకు పరమపదించారు. సమాచారం అందుకున్న జిల్లా బీఆర్ఎస్ నాయకులు తోట రామారావు వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదారుస్తూ మనోధైర్యాన్ని కల్పించి వారితో వారికున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకొని ప్రతి దైవ కార్యక్రమం లో వారు ఎంతో చురుకుగా పాల్గొనేవారు అని వారికున్న దైవ భక్తితో శివుని అనుగ్రహంతో గుంటు మల్లేశ్వర స్వామి ఆలయ డైరెక్టర్ గా నియామకమై దైవ సన్నిధిలో పలు పూజా కార్యక్రమాలు ప్రజలతో మమేకమై ప్రజాభిమానంతో పదవీ కాలాన్ని పూర్తి చేశారనీ



కొన్ని రోజుల క్రితం వారు అనారోగ్యానికి గురై మరల చికిత్స అనంతరం పూర్తిస్థాయిలో కోలుకొని యధావిధిగా తమకార్యకలాపాలు నిర్వహిస్తూ ఆకస్మికంగా గుండె నొప్పితో మృతి చెందడం మాకు నమ్మలేని నిజంగా ఉన్నదని వారి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ మృతుని పార్థివ దేవం పై పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించారు.తదనంతరం జరిగిన తుది అంతిమయాత్రలో వారు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.అంతిమయాత్రలో 48 వ డివిజన్ నివాసితులు వంగాల వెంకట్, చేతి కృష్ణ, కిషన్ నాయక్, బాబా, వేల్పుల శ్రీను, దొడ్డ వెంకటేశ్వర్లు, నరసయ్య, రాము, వెంకటేశ్వరరావు, విప్పా వేణు మోహన్, శాభాసు రమణ, తోకల ప్రభాకర్, సత్యం, నవీన్, ప్రతాపనేని శ్రీను పాల్గొన్నారు.

# పెట్రోల్ ,డీజిల్ రేట్లను పెంచి ప్రజలపై భారం మోపడం దుర్మార్గం సిఐటియు ఖండన

నెల్లూరు జిల్లా సైదాపురం(బి.యన్.యస్):-సిఐటియు సైదాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో పెట్రోల్ డీజిల్ రేట్లను పెంచినందుకు నిరసనగా సైదాపురం మండల ఉన్న పెట్రోల్ బంకు ముందు సిఐటియు సైదాపురం కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పంచేటి, శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో పెట్రోలు ప్రజలకు అందుబాటులో లేకుండా గత 20 రోజుల కిందట పెట్రోల్ కొరతను సృష్టించి అనేక పెట్రోల్ బంకులు లో వందలాదిమంది క్యూ కట్టి పెట్రోల్ పట్టించుకునే పరిస్థితి ఏర్పడింది ,



ఇలాంటి సమయంలో యుద్ధం పేరుతో బిజెపి ప్రభుత్వం గత 14 రోజుల నుండి సుమారు 5 సార్లు పెట్రోల్, డీజిల్ ను పెంచారు డీజిల్ పై తొమ్మిది రూపాయలు పెట్రోల్ పై ఏడు రూపాయలు పెంచి ప్రజలపై బారాలను మోపి దేశంలో ప్రైవేట్ కార్పొరేట్ , శక్తులకు మేలు చేసే విధంగా అదానీ , అంబానీ ఆస్తులు పెరుగుతున్నాయా తప్ప ప్రజల యొక్క ఆదాయం పెరగడం లేదని నరేంద్ర మోడీ దేశంలో కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ ఉన్నారని తెలియజేశారు ఇప్పటికైనా పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని సిఐటియు సైదాపురం కమిటీ నుండి డిమాండ్ చేశారు....

# ప్రవేశ పరీక్షలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన రుష్మిత

వేంసూరు, మే 29 కార్పొరేట్ కళాశాలలలో చేరేందుకై మేధా చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన ప్రవేశ పోటీలో వేంసూరు మండలం, మర్లపాడు గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.రుష్మిత ఖమ్మం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మేధా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మార్చినెలలో ప్రతిభ గలిగిన నిరుపేద వర్గాలకు చెందిన బాలికలకు ప్రవేశ పరీక్ష నిర్వహించింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో ఈ పరీక్ష నిర్వహించారు.పాల్గొన్న వారిలో మర్లపాడు ఉన్నత పాఠశాల విద్యార్థిని రుష్మిత జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. రుష్మితకు మేధా చారిటబుల్ ట్రస్ట్ ఇంటర్ ఉచిత విద్యను తమ కళాశాలలో అందించి ఎంబిబియసలేదా డిగ్రీ వరకు ఏ కార్పొరెట్ కళాశాలలో చేరినప్పటికి అయ్యే ఖర్చు మొత్తాన్ని సంస్థ భరిస్తుంది.

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబ వర్గాలకు చెందిన తనను ఎంపిక చేసిన మేధా చారిటబుల్ ట్రస్ట్ కు రుష్మిత కృతజ్ఞతలు తెలిపింది. బైపీసి విభాగం నుండి ఎంబిబియస్. ఉన్నత విద్యను చదవాలనే తన కలను నెరవేరుస్తున్న మేధా చారిటబుల్ ట్రస్ట్ నిజం చేస్తున్నందుకు తాను ఎంతో కృతజ్ఞురాలినని తెలిపింది.

రుష్మిత తండ్రి రాఘవులు మర్లపాడు గ్రామానికిచెందిన వారు. రుష్మిత తన పదవ తరగతివరకు స్థానిక ఉన్నత పాఠశాలలో పూర్తి చేసారు. తనను ఈ స్థాయిలో నిలిపిన తల్లిదండ్రులకు,గురువులకు ధన్యవాదాలు తెలిపింది.